క్లుప్తంగా

ఎమ్మెల్యే వసంతను కలిసిన సీఐ సత్యనారాయణ



ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ముత్యాల సత్యనారాయణ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఐతవరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అంకితభావంతో పనిచేసి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వసంత సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు.

ఆగిరిపల్లి ఎస్‌ఐ చంటిబాబు బదిలీ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ఎస్‌ఐ నంబూరి చంటిబాబు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌కి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు



మైలవరం: అయోధ్యలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ మైలవరం నియోజకవర్గ కో కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. మైలవరం 10వ వార్డులో అయోధ్య శ్రీరాముని అక్షింతలను శుక్రవారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. భక్తులు తమ ఇళ్లలో ఉండే సీతారామస్వామి వార్లకు పూజలు నిర్వహించి అక్షింతలు చల్లుకోవాని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.కోటేశ్వరరావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

మైలవరం: మైలవరం ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని సంఘం కార్యదర్శి కాజా మహేష్ శుక్రవారం తెలిపారు. మైలవరంలోని రామాలయం వీధిలో మధ్యాహ్నం రెండు గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 15 ఏళ్లు నిండిన యువతులు, మహిళలు అర్హులని, పోటీల సమయానికి ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఎవరి ముగ్గులు వారే తీసుకురావాలన్నారు. వారికి కేటాయించిన సమయంలో ముగ్గులు పూర్తి చేయాలని సూచించారు. ముగ్గులు వేసిన అనంతరం న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు నిర్ణయిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంచర్ల



తిరువూరు: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరువూరుకు చెందిన సీనియర్ న్యాయవాది కంచర్ల ముత్యప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామక ఉత్తర్వులను శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని రాష్ట్ర కార్యాలయంలో ముత్యప్రసాద్‌కు అందజేశారు. తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సోమవరపు సత్యనారాయణ, సంఘ నాయకులు ముత్తారావు, బొడ్డు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు



కంచికచర్ల(వీరులపాడు): స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం యోగి వేమన జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలలోని నీతిని ఈతరం వారు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాహిత్య రంగానికి వేమన చేసిన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి యోగి వేమన జయంతిని నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో బీడీసీ నిర్వాహకులు ఆవల పేరయ్య, వుయ్యూరు శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

ఊరికి ఉపకారి



కనుమూరులో నిర్మించిన కర్మల సత్రం



కనుమూరు గ్రామస్తులు మంచినీరు తెచ్చుకొనేందుకు ఏర్పాటు చేసిన ట్యాంకర్

- రూ.15 లక్షలతో స్వగ్రామానికి మౌలిక వసతుల కల్పన
- ఆదర్శంగా నిలుస్తున్న విశ్రాంత అధ్యాపకుడు బాపిరెడ్డి



జంగా కనక బాపిరెడ్డి

కనుమూరు(గంపలగూడెం): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా తాను జన్మించిన గ్రామంలోని సమస్యల పరిష్కారానికి నడుం బిగించారు విశ్రాంత అధ్యాపకుడు జంగా కనకబాపిరెడ్డి. స్వగ్రామం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలంలోని మారుమూల పల్లె అయిన కనుమూరు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన సంపాదనలో కొంతభాగాన్ని వెచ్చించారు. ఊరు మారితే అందరూ బాగుంటారని భావించిన బాపిరెడ్డి గ్రామంలో కర్మల సత్రం, అంకమ్మ గుడి వద్ద భక్తుల కోసం మరో సత్రం, వాటర్ ట్యాంకర్, రెండు బస్ షెల్టర్ల నిర్మాణం, పాఠశాలల్లో బెంచీలు ఏర్పాటు తదితరాలను రూ. 15 లక్షలతో ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరూ ఈ విధంగా తమ వంతు స్వ గ్రామాలకు తోడ్పాటునందిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

కర్మల సత్రం నిర్మాణం..

గ్రామంలో శ్మశాన వాటికలో సరైన వసతిలేక అంత్యక్రియల సమయంలో మృతుల కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురయ్యేవారు. బాపిరెడ్డి స్పందించి తన సొంత నిధులు రూ.6 లక్షల వ్యయంతో కర్మల సత్రం నిర్మించారు. తన తల్లిదండ్రులు దివంగత జంగా పుల్లారెడ్డి, వెంకట సీతారత్నం, మేనమామ, అత్తయ్యలు దివంగత రేగళ్ల కాంతారెడ్డి, శాంతమ్మ, కుటుంబీకులు జంగా భారతిల జ్ఞాపకార్థం జంగా కనకబాపిరెడ్డి, శివ నాగేంద్రమ్మ దంపతులు, వారి కుమారులు జంగా శ్రీనివాస చక్రవర్తి, రష్మిక, జంగా సుకుమార్, విక్రాంతి దంపతుల సౌజన్యంతో సత్రం నిర్మాణాన్ని పూర్తి చేశారు.

అంకమ్మగుడి వద్ద భక్తుల కోసం మరో సత్రం..

అంకమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కనక బాపిరెడ్డి మరో సత్రం నిర్మించారు. రూ.3.5 లక్షల వ్యయంతో భక్తులకు పొంగలి, తదితర కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు సౌకర్యవంతంగా సత్రం గది నిర్మాణం చేసి ప్రజల మన్ననలు పొందారు.

వాటర్ ట్యాంకర్ అందజేత..

గ్రామస్తులు శుభకార్యాలు జరుపుకొనే సమయంలో మంచినీరు తెచ్చుకొనేందుకు వీలుగా వాటర్ ట్యాంకర్‌ను తయారు చేయించి గ్రామస్తులకు అందజేశారు.

పాఠశాలకు బల్లలు, బెంచీలు..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యవంతంగా రూ.1.50 లక్షల వ్యయంతో బెంచీలు, బల్లలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు మరో రూ.25 వేలను డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించే విద్యార్థులకు ప్రతి ఏటా ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. పాఠశాలకు రూ.25 వేలు ఖర్చు చేసి సమావేశాల సమయంలో ఉపయోగించుకొనేందుకు సౌండ్‌సిస్టమ్ అందజేశారు. విద్యార్థులు ఆటలు ఆడుకొనేందుకు అవసరమైన రూ.15 వేల విలువ చేసే క్రీడా పరికరాలను కూడా బాపిరెడ్డి అందజేశారు.

రెండు బస్‌షెల్టర్ల నిర్మాణం

కుటుంబీకురాలు దివంగత జంగా భారతి పేరున రూ.50 వేల వ్యయంతో 1999లో ఒక బస్‌షెల్టర్, 2010లో మరో బస్‌షెల్టర్‌ను గ్రామంలో నిర్మించారు. గ్రామంలో పూర్వం నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బాపిరెడ్డి తనవంతు సహకారం అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చాట్రాయి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన అబ్బదాసరి కృష్ణ (38) ఈనెల 17న బూరుగుగూడెం గ్రామంలోని తన చెల్లి ఇంటికి వెళ్లాడు. అదే రోజున ఎన్టీఆర్ జిల్లా మల్లేల గ్రామానికి చెందిన పత్తిపాటి నాగరాజు కూడా కృష్ణ చెల్లి ఇంటికి వచ్చాడు. వీరి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నాగరాజు కత్తిపీటతో కృష్ణ తలపై కొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతనిని 108 వాహనంలో చింతలపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఏలూరు, విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు ఉన్నాడు. మృతుడి తల్లి అబ్బదాసరి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నూజివీడు టౌన్ సీఐ ఎంజీవీ మూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి కులగణన సర్వే ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ఇంటింటి సర్వే కొండపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం ప్రారంభమైంది. వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల కులం, ఉపకులం, నివాస గృహం, వృత్తి, పశుసంపద, ఆర్థిక స్థితిగతుల వివరాలను సేకరించారు. మున్సిపాలిటీలోని 10వ వార్డు సచివాలయాల్లో 19 నుంచి కులగణన ప్రారంభం కాగా ఈనెల 29వ తేదీ వరకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. వార్డు సచివాలయ కార్యదర్శి జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నాయకత్వంలో అన్ని వర్గాలకు మేలు

పటమట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. స్థానిక పంజా సెంటర్‌లో ఖ్వాజా గరీబ్ నవాజ్ గంధ మహోత్సవాన్ని కేజీఎస్ అండ్ జీఎఫ్‌ఎస్ ఫ్లవర్ మర్చంట్స్, సందీప్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకొని లోటే చోటే మస్తాన్ బాబా వారి దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత దర్గాలో బాబావారిని దర్శించుకొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ గంధం మహోత్సవంలో ప్రజలందరూ కులమతాలకు అతీతంగా పాల్గొంటున్నారని చెప్పారు. పాతబస్తీ ప్రజానీకం కులమతాలకు అతీతంగా జీవిస్తున్నారని, ఇది అందరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. గంధం మహోత్సవం ప్రజలకు మేలు చేయా లని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కులమతాలకు అతీతంగా అద్భుతమైన పరిపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్పొరేటర్ యలకల చలపతిరావు, వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి మండల శ్రీను, నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న షేక్ ఆసిఫ్

నిమ్రా ఫార్మసీ కళాశాలకు యూజీసీ గుర్తింపు

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఫార్మసీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లభించిందని కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి. నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006లో నిమ్రా యాజమాన్యం ప్రారంభించిన కళాశాల దినదినాభివృద్ధి చెంది నేడు విద్యార్థులకు ఫార్మసీ, ఫార్మా డి, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్య అందిస్తోందని తెలిపారు. ఈ కోర్సులన్నిటికీ యూజీసీ 2ఎఫ్ గుర్తింపు లభించిందన్నారు. గత అక్టోబర్‌లో న్యాక్ బృందం పర్యటించి ఏ గ్రేడ్ గుర్తింపు ప్రకటించిందని వివరించారు.

విజయవాడకు భారీగా తరలిన అభిమానులు

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరువూరు నియోజకవర్గం నుంచి విజయవాడకు భారీ సంఖ్యలో ప్రజలు, అంబేడ్కర్ అభిమానులు శుక్రవారం స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. అన్ని గ్రామాల నుంచి మహిళలు, యువకులు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లగా వారికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సహకరించారు.

తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు మండలాల నుంచి 60 ప్రత్యేక బస్సుల్లో మహిళలు, యువకులు విజయవాడకు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. తిరువూరు బోస్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన స్వామిదాసు ప్రత్యేక వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుధారాణి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మా కోటేశ్వరి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, సుందర కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **మైలవరం:** మైలవరం మండలంలోని ప్రతి గ్రామం నుంచి అంబేడ్కర్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విజయవాడకు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపు మేరకు మైలవరం మండలంలోని స్థానిక నాయకులు వారికి సహకరించారు. ఆయా గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, మైలవరం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గన్నేపూడి వెంకట్రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అంబేడ్కరిస్టులు, నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- **రెడ్డిగూడెం:** మండలం నుంచి ప్రత్యేక బస్సుల్లో ప్రజలు, అంబేడ్కర్ అభిమానులు భారీ సంఖ్యలో విజయవాడకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొలగాని తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, తోటకూర రవిబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాట్ల రామారావు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం, మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో విజయవాడకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాండ్రకొండ గురవయ్య, జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్య, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.



తిరువూరులో ప్రత్యేక బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న స్వామిదాసు

బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే..

నూజివీడు:విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. ప్రజలు తరలి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సులను నూజివీడులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 45 బస్సులను ఏర్పాటు చేశామని, వీటితో పాటు అధిక సంఖ్య లో ప్రజలు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో విజయవాడ తరలివెళ్లారన్నారు.

- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలి వెళ్లారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఎంపీటీసీ సాదం గోపి, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకుడు కంబాల ప్రదీప్, మాజీ ఎంపీటీసీ చౌటపల్లి అంజయ్య, మల్లంపల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.



నూజివీడులో బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

- **చాట్రాయి:** చాట్రాయి మండలం నుంచి శుక్రవారం విజయవాడకు భారీగా ప్రజలు తరలి వెళ్లారు. జై భీం, జైజై భీం, జయహో అంబేడ్కరా అంటూ నినాదాలు చేస్తూ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై అభిమానులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు.
- **విస్సన్నపేట:** మండలంలోని అన్ని గ్రామాల నుండి 12 బస్సులలో అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శుక్రవారం భారీగా విజయవాడకు తరలి వెళ్లారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మండలం నుండి విజయవాడకు తరలివెళ్లే బస్సులను జెండా ఊపి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, ఏపీఎం జమలయ్య, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు గాజుల శ్రీనివాసరావురెడ్డి, శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి మత్యాలరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.
- **తిరువూరురూరల్:** విజయవాడలో శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తిరువూరు మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అక్కపాలెం, మునుకుళ్ళ, వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, కాకర్ల, కోకిలంపాడు, లక్ష్మీపురం, చింతలపాడు, రోలుపడి, చిట్టేల, ఆంజనేయపురం, మల్లేల గ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో అభిమానులు, నాయకులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.

అంబేడ్కర్ ఆశయ సాధన జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక మైలవరం రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం ఆయన క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. అంబేడ్కర్ అందరివాడని తెలిసేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదానంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద 206 అడుగుల ఎత్తు కలిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను రూపొందించి అమలు చేశారన్నారు. అంబేడ్కర్ మహాశిల్పం ఏర్పాటు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయడం అందరి బాధ్యత అని చెప్పారు. చంద్రబాబు పాలనలో దళిత వర్గాలకు తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ పాలనలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటును గ్రాఫిక్స్‌లో మాత్రమే చూపించారని, వైఎస్ జగన్ మాత్రం రెండేళ్లలో రూ.400 కోట్లతో 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు కాలి సుగుణరావు, షేక్ గబ్బర్, చేబత్తిన మున్నా, ఉదయగిరి కృపారావు, కళ్లేపల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి వాలీబాల్ విజేత చిత్తపూరు 2 జట్టు



మండల స్థాయి క్రికెట్ విజేత తాతకుంట్ల టీం

చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం బాలబాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా మర్లపాలెం, కబడ్డీ చనుబండ, ఖోఖో కోటపాడు మండల విన్నర్‌గా నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్ చిత్తపూరు 2, ఖోఖోలో కోటపాడు జట్లు విన్నర్‌గా నిలిచాయి. ఈ పోటీల్లో సతీష్, ప్రభాకర్, విజయ్‌లు ఎంపైర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయని ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. తాతకుంట్ల టీం మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె. సురేష్, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఆదినారాయణ, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.
- **ఏ.కొండూరు:** మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్ క్రికెట్ పోటీల్లో పోలిశెట్టిపాడు, ఏ.కొండూరు, కోడూరు, కుమ్మరికుంట్ల గ్రామాల జట్లు తలపడ్డాయి. కోడూరు, ఏ.కొండూరు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడతాయని ఎంపీడీఓ రవికాంత్ తెలిపారు.



వాలీబాల్ విన్నర్ చిత్తపూరు 2 జట్టు

- **ఆగిరిపల్లి:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈదర, ఆగిరిపల్లి సచివాలయాల జట్ల మధ్య జరిగిన మండల స్థాయి మహిళల ఫైనల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆగిరిపల్లి జట్టు విజేతగా నిలిచింది. మండలంలో శుక్రవారం 54 క్రీడా పోటీలు నిర్వహించామని ఈవోపీఆర్డీ శేఖర్ తెలిపారు. పీఈటీ నాగేంద్ర క్రీడా పోటీలను నిర్వహించారు.
- **ముసునూరు:** ముసునూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను శుక్రవారం ఎంపీడీఓ జి.రాణి పరిశీలించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నాలుగు సచివాలయాల పరిధిలోని క్రికెట్ టీమ్‌ల మధ్య రెండు మ్యాచ్‌లు జరిగాయి. పీడీలు ఆలీ, సుకుమార్‌లు పోటీలను నిర్వహించారు. ఈనెల 20వ తేదీన క్రీడా పోటీల ఫైనల్స్ నిర్వహిస్తామని పీడీ ఆలీ తెలిపారు.

సామాజిక సేవలో వ్యవసాయ విద్యార్థులు

పోచంపల్లి (జగ్గయ్యపేట): విద్యార్థులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కృష్ణంరాజు అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పోచంపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు వారం రోజులపాటు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలు, తీసుకుంటున్న జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటారన్నారు. అంతేకాకుండా విద్యార్థులు గ్రామాల్లో పర్యటించి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం రైతులతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచి బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పెడవెల్లి పరమేశ్వరరావు, శాస్త్రవేత్తలు విశ్వజారాజ్, విజయప్రకాష్, బాలమురళీధరన్, వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



పాలడుగు వెంకట్రావుకు నివాళి

ముసునూరు: ధైర్యసాహసాలు, ఉక్కు సంకల్పంతో జమిందారీ వ్యవస్థకు ఎదురొడ్డి పేద ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన నీతివంతమైన రాజకీయ నేత పాలడుగు వెంకట్రావు జీవితం ఆదర్శమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వలసపల్లి రామచంద్ర ప్రసాద్ (రాముడు) అన్నారు. వెంకటరావు 9వ వర్థంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గుళ్లపూడిలో పాలడుగు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేంపాటి వల్లీ పద్మజ రాంబాబు, మాజీ సర్పంచ్ ఊరకరణం వల్లీ శాంతకుమారి, సీనియర్ నేతలు కూరపాటి శోభనాద్రి, వేంపాటి సత్యనారాయణ, మండల కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు వరమని జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహన్ అధ్యక్షతన శుక్రవారం లోపూడి సచివాలయ ప్రాంగణంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, రవళి 526 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 68 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. 22 మందికి కళ్ల జోళ్లు అందజేశారు. సర్పంచ్ పేరం కృష్ణ, ఉప సర్పంచ్ బాబూరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బలుమూరి నరసింహారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.